7

సాక్షి అనకాపల్లి

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023

ఓటర్ల నమోదుపై స్పెషల్ డ్రైవ్



మునగపాక: అరబుపాలెం పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మాకవరపాలెం: ఓటరు జాబితాను పరిశీలిస్తున్న డీఆర్వో దయానిధి

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా రెవెన్యూ అధికారులు

మునగపాక/యలమంచిలి (అనకాపల్లి రూరల్): కొత్త ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణ ఎలా సాగుతుందో పరిశీలించేందుకు కలెక్టర్ సహా జిల్లాలోని రెవెన్యూ అధికారులంతా శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మునగపాక మండలం అరబుపాలెం పోలింగ్ కేంద్రాన్ని, యలమంచిలి తులసీనగర్‌లోని జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఇంతవరకు ఎంతమంది కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారనే విషయాన్ని బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. తొలగింపులు, సవరణలకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి మనోరంజని, డీఎల్‌డీవో మంజులావాణి, తహసీల్దార్ వినయ్‌కుమార్, ఎంపీడీవో మన్మధరావు, సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తప్పు ఒప్పులను సరిచేసే బాధ్యత అధికారులదే..

నాతవరం/మాకవరపాలెం: ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత మనదేనని డీఆర్వో దయానిధి అన్నారు. నాతవరం మండలం మర్రిపాలెం పంచాయతీలో 9, 98, 99 నంబర్ పోలింగ్ కేంద్రాలను, మాకవరపాలెం మండలం రాచపల్లి, కొండలఅగ్రహారం, మాకవరపాలెం గ్రామాలను ఆయన శనివారం సందర్శించారు. కొత్తగా వచ్చిన ఓటర్ల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఓటర్ల జాబితాల్లో తప్పు ఒప్పులను సరిచేసే బాధ్యత పోలింగ్ బూత్ అధికారులదేనన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. కోఆపరేటివ్ అధికారి కిరణ్‌కుమారి, ఆర్డీవో జయరాం, తహసీల్దార్ ప్రసాద్ ఆయన వెంట ఉన్నారు.

ముంచుకొస్తున్న మిచాంగ్

- 4, 5 తేదీల్లో భారీ వర్షాలు పడే సూచన
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- తుపాను రక్షిత కేంద్రాలు సిద్ధం
- అధికారులకు సెలవులు రద్దు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



అధికారులతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, అనకాపల్లి: బంగాళాఖాతంలో మిచాంగ్ తుఫాన్‌ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంతంలో ఈదురు గాలులతోపాటు సముద్రపు అలలు ఎగిసి పడే అవకాశముందని జారీ చేసిన హెచ్చరికల మేరకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వర్చువల్‌గా అత్యవసర సమీక్ష నిర్వహించారు. 18 మందితో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంత మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మత్స్యకారులెవరూ సముద్రంలోనికి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. జిల్లాలో 6 తీర ప్రాంత మండలాలుగా, 18 మండలాలు వరద ముంపు మండలాలుగా గుర్తించారు.

అధికారులకు దిశానిర్దేశం

ప్రధానంగా రైతులకు తుపాను సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని వ్యవసాయ శాఖ జేడీ మోహన్‌రావును కలెక్టర్ ఆదేశించారు. వరి కోతలు కోయకుండా వ్యవసాయ అధికారులు, ఆర్‌బీకేలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌ల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మంచినీటి పంపింగ్ స్టేషన్లో డీజిల్ జనరేటర్స్ సిద్ధంగా ఉంచాలని, టెలికాం ఆపరేటర్లు మొబైల్ సిగ్నల్స్‌కు అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైతే తుఫాన్ బాధితులకు అందించేందుకు రేషన్ సిద్ధంగా ఉంచాలని, తుఫాన్ రక్షిత భవనాల్ని సిద్ధం చేయాలనీ రెవెన్యూ అధికారుల్ని ఆదేశించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్‌ని ఆదేశించారు.

52 పునరావాస కేంద్రాలు సిద్ధం

జిల్లాలో నూతనంగా నిర్మించిన 28 మల్టీపర్పస్ పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. వాటితో పాటు మరో 24 తాత్కాలిక పునరావాస కేంద్రాలను గుర్తించారు. వీటిలో 60 వేల మందికి పైగా వసతి కల్పించేలా సౌకర్యం ఉంటుంది. ఈ కేంద్రాల్లో భోజన ఏర్పాట్లు, లైటింగ్ సదుపాయం, మెడికల్ కిట్స్, దుప్పట్లు, మంచినీరు వంటి సదుపాయాలతో సిద్ధంగా ఉండేలా సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బలగాలు విపత్తు నిర్వహణ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

వేటకు వెళ్లొద్దు : ఎస్పీ

ఎలాంటి పరిస్థితులనైనా ఇతర ప్రభుత్వ శాఖల సహాయంతో దీటుగా ఎదుర్కొని సహాయక చర్యల్లో పాల్గొనేందుకు పోలీసు బృందాలు సిద్ధంగా ఉన్నాయని ఎస్పీ మురళీకృష్ణ చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, తుఫాన్ తీవ్రతను బట్టి ముంపు ప్రాంత ప్రజలు ఏ సమయంలోనైనా సురక్షిత ప్రాంతాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు.



వేటకు వెళ్లకుండా ఒడ్డున భద్రపరచిన తెప్పలు

తుపాను కంట్రోల్ రూమ్ నంబర్లు
కలెక్టరేట్ 8924222888
పోలీస్ 93469 12724
అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం 100, 112

తీరం చేరిన తెప్పలు

నక్కపల్లి/రాంబిల్లి: వాతావరణ మార్పులతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా వరి రైతులు కలవరపడుతున్నారు. రాంబిల్లి, వాడనర్సాపురం, సీతపాలెం, కొత్తపట్నం, లోవపాలెం తీరాల్లో అలలు ఎగసిపడుతున్నాయి. నక్కపల్లి మండలంలో పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, బంగారయ్యపేట, డిఎల్‌పురం, రాజయ్యపేట, బోయపాడు, గునిపూడి, తదితర గ్రామాల్లో మత్స్యకారులంతా వేటమాని ఒడ్డున తెప్పలు, వలలు, ఇంజన్లు, భద్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు. పాయకరావుపేట మండలంలో రాజానగరం, వెంకటనగరం, రాజయ్యపేట, పెంటకోట, రాజవరం, పాల్మన్‌పేట తదితర గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మత్స్యకారులు తెప్పలను తీరం ఒడ్డుకు చేర్చి సురక్షితంగా వుండే చర్యలు తీసుకున్నారు.

ఆర్థో విభాగం ఆధునికీకరణ
- ఏషియన్ పెయింట్స్ సీఎస్సార్ నిధులతో కొత్త పరికరాలు
- ఎన్టీఆర్ వైద్యాలయంలో ఎముకల విభాగం అభివృద్ధి

8లో

ఆత్మీయ హస్తంతో ఆత్మస్థైర్యం

కల్లాకపటం తెలియని పిల్లలు.. విధి చిన్న చూపు చూడడంతో అలా జన్మించారు.. సహనంతో ఆత్మీయ హస్తం అందిస్తే సిరిమల్లె పువ్వుల్లా వికసిస్తారు.. అందుకు ఈ చిన్నారులే ఉదాహరణ

- వైకల్యాన్ని జయిస్తున్న దివ్యాంగ విద్యార్థులు
- చదువు, ఆట, పాటల్లో రాణింపు
- మెండుగా ప్రభుత్వ ప్రోత్సాహం
- నేడు ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా...

ఇతని పేరు విశ్వాసి రుషి. నక్కపల్లి మండలం జగన్నాథపురం గ్రామం. ఐదేళ్ల వయసులో తల్లిదండ్రులు ఇతనిలో మానసిక వైకల్యాన్ని గుర్తించారు. అతని భవిష్యత్తు విషయంలో భయాందోళన చెందారు. పాఠశాలలో చేరిస్తే తోటి విద్యార్థులను చూసి మార్పు వస్తుందేమో అని ఆశపడ్డారు. అయితే వారి ఆశలు పూర్తిగా ఫలించలేదు. ఐదో తరగతి వరకు అదే పాఠశాలలో చదివినప్పటికీ పెద్దగా మార్పు కనిపించలేదు. చొక్కా సరిగా తొడుక్కోలేకపోవడం, తిండి సరిగా తినలేకపోవడం, అందరితో కలవకపోవడం అతని లోపాలు. అయితే అధైర్య పడకుండా తమ కుమారుడిలో మానసిక మార్పు చూడాలని సమీపంలో ఉన్న గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక పాఠశాలలో చేర్పించారు. ఇక్కడ దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల్లో మానసిక పరిపక్వత తీసుకువస్తూ విద్యాబోధన చేసేందుకు నియమితులైన ఉపాధ్యాయిని షేక్ యాస్మిన్ ఈ విద్యార్థి బాధ్యతలు తీసుకున్నారు. ఈ పాఠశాలలో ఇటువంటి బాలలు 22 మంది ఉన్నారు. వీరికి చక్కని తర్ఫీదుతో బోధన చేస్తూ వారిలో మానసిక వికాసం పెంపొందించేందుకు యాస్మిన్ కృషి చేశారు. ఫలితంగా విశ్వాసి రుషిలో పూర్తిగా మార్పు వచ్చింది. ఇప్పుడు తన పనులన్నీ తాను ఎంచక్కా చేసుకుంటున్నాడు. తోటి విద్యార్థులతో కలిసిమెలసి ఉంటున్నాడు. పాఠశాలలో నిర్వహించే ఆటల పోటీల్లో పాల్గొనడమే కాదు విజయాలు సాధిస్తున్నాడు. తనలో ఉన్న లోపాన్ని అధిగమించి తాను అందరితో సమానమేనని చాటి చెబుతున్నాడు. రిషి ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.



రిషితో ఉపాధ్యాయిని యాస్మిన్



కృషి..రిషి: ఒకప్పుడు దుస్తులు సరిగా వేసుకోలేని స్థితిలో ఉన్న రిషి.. తర్ఫీదు అనంతరం ఇప్పుడిలా చక్కగా తయారయ్యాడు..



ఆటల పోటీల్లో ద్వితీయ స్థానం పొందిన వరుణ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయుడు

ఇతని పేరు వరుణ్..4వ తరగతి విద్యార్థి. వినికిడి లోపంతో బాధపడేవాడు. వరుణ్‌కు ప్రభుత్వం వినికిడి యంత్రం సమకూర్చింది. ఇతను ఆటల్లో బాగా రాణిస్తాడని గుర్తించిన ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాడు. పాఠశాలలో సైన్ లాంగ్వేజ్ ద్వారా విద్యనభ్యసిస్తున్నాడు. అలాగే సింహాచలం అనే బాలిక స్క్రైబ్ సాయంతో పదో తరగతి పరీక్ష రాసి బి గ్రేడ్‌లో ఉత్తీర్ణురాలైంది. ప్రస్తుతం నక్కపల్లి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది.

నక్కపల్లి: ఇలా విధి వంచితులైన ఎందరో విద్యార్థులు ఆత్మస్థైర్యంతో తమలోని వైకల్యాన్ని అధిగమించి మార్పు సాధించారు. దివ్యాంగుల్లో ప్రత్యేక బోధన ద్వారా విద్యలో రాణించడం అసాధ్యం అనుకునే వారికి సాధ్యం చేయొచ్చని యాస్మిన్ వంటి ఉపాధ్యాయులు నిరూపించారు. ఇందుకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు ఎంతో దోహదపడిందని చెబుతున్నారు. ప్రతి మండలంలోను ప్రభుత్వం భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ద్వారా గ్రామాల్లో దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు, బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న వారిని గుర్తించింది. ఇలా నక్కపల్లి మండలంలో 102 మందిని గుర్తించారు. వీరి కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో ఇద్దరు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించారు. వారంలో ఐదు రోజులు ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను కేంద్రానికి తీసుకువచ్చి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి శనివారం ఈ విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి బోధన చేయడంతోపాటు ఫిజియో థెరపీ చేయిస్తారు. గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 22 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ మరో టీచర్‌ను నియమించారు. ఇక్కడ విద్యార్థులకు ప్రభుత్వం ఇంటి నుంచి పాఠశాలకు రావడానికి ప్రతి నెలా రూ.3 వేలు ఆర్థిక సాయం అందిస్తోంది. సదరం ధ్రువపత్రం ఉన్నవారికి రూ.3 వేలు పింఛను ఇస్తోంది. దివ్యాంగ విద్యార్థుల కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేక యాప్స్ ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లు అందిస్తోంది. వాటి ద్వారా టీచర్లు విద్యాబోధన చేస్తారు.

ఆర్థో విభాగం ఆధునికీకరణ

- ఏషియన్ పెయింట్స్ సీఎస్సార్ నిధులతో కొత్త పరికరాలు
- ఎన్టీఆర్ వైద్యాలయంలో ఎముకల విభాగం అభివృద్ధి
- వారం రోజుల్లో ట్రామా కేర్ ఆస్పత్రికి శంకుస్థాపన
- ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి



ఆపరేషన్ థియేటర్‌లో అత్యాధునిక పరికరాలతో కూడిన బెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ బీవీ సత్యవతి

అనకాపల్లి టౌన్: అచ్యుతాపురం సెజ్‌లోని ఏషియన్ పెయింట్స్ సంస్థ సహకారంతో ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయంలో ఎముకల (ఆర్థో) విభాగాన్ని ఆధునికీకరించారు. ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి చొరవతో సంస్థ తన సీఎస్సార్ నిధుల నుంచి మంజూరు చేసిన రూ.15 లక్షలతో ఆధునిక పరికరాలను, ఆపరేషన్ థియేటర్‌లోని బెడ్‌లను సమకూర్చారు. ఎంపీ సత్యవతి వీటిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేజీహెచ్‌కు దీటుగా ఎన్టీఆర్ వైద్యాలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఏషియన్ పెయింట్స్ సంస్థను మరో రూ.25 నుంచి 30 లక్షలు సహాయం చేయవలసిందిగా కోరామని, ఆ నిధులను అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్, ఇతర పరికరాల కొనుగోలుకు వినియోగిస్తామన్నారు. ఆస్పత్రి ఆవరణలో ట్రామా క్రిటికల్ కేర్ బ్లాక్ భవన నిర్మాణ పనులకు (జీ ప్లస్ 2) కేంద్ర ప్రభుత్వం రూ.22.5 కోట్ల నిధులు నిధులు విడుదల చేస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో అంతస్తుకు రూ.10 కోట్లు నిధులు అందించినట్టు ఆమె చెప్పారు. వారం రోజుల్లో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వర్చువల్ పద్ధతిలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ఆమె తెలిపారు. ఎన్టీఆర్ వైద్యాలయాన్ని దశలవారీగా మెడికల్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆమె చెప్పారు. అనంతరం ఆస్పత్రి ఎదురుగా కొత్తగా నిర్మాణం చేసే ట్రామాకేర్ బ్లాక్ స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయం డీసీహెచ్ఎస్ ఎస్.శ్రీనివాసరావు, అచ్యుతాపురం ఏషియన్ పెయింట్స్ జనరల్ మేనేజర్ జనార్దనరావు, ఆర్ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు రూ.100 కోట్ల రుణాల లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు



డీసీసీబీ చైర్మన్ గురువులను సత్కరిస్తున్న పర్సన్ ఇన్‌చార్జులు రాజేష్, చెల్లంనాయుడు

మాడుగుల: వచ్చే మార్చిలోగా రైతులకు రూ.100 కోట్లు రుణాలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకును ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన్ను పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు గొల్లవిల్లి రాజేష్, కోరుకొండ చెల్లంనాయుడు, బొద్దపు భాస్కరరావు, కాళ్ల రాము కలిశారు. మాడుగుల మండలంలో శిథిలమైన నాలుగు పీఏసీఎస్ భవనాలను అభివృద్ధి చేయాలని, సభ్య రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం చైర్మన్ గురువులుకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

యథావిధిగా రిజిస్ట్రేషన్లు

అనకాపల్లి టౌన్: స్థానిక జాతీయ రహదారి ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం 32 డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ చేసినట్టు సబ్ రిజిషర్ వి.బసవేశ్వరరావు చెప్పారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ సర్వర్ పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు జరగలేదని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 300 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలిపారు.

తల్లికి తనయ తలకొరివి



తల్లి పార్థీవ దేహాన్ని తీసుకువెళ్లిన్న కుమార్తె

మునగపాక: కొడుకులు లేకున్నా తానున్నానంటూ ముందుకొచ్చి తల్లికి కుమార్తె తల కొరివి పెట్టి రుణం తీర్చుకుంది. ఈ సంఘటన మునగపాకలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పీలా జగ్గయమ్మ (72) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఆమెకు కుమారులు లేరు. దాంతో కుమార్తె దాడి మహా వెంకటలక్ష్మి అన్నీ తానై తల్లి అంత్యక్రియలు నిర్వహించింది. ఈ సంఘటన స్థానికులను కంటతడి పెట్టించింది.

17న రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: స్థానిక వి.వి.రమణ రైతుభారతి ఆడిటోరియంలో ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు మిస్టర్ ఆంధ్రా-2023 రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ది అనకాపల్లి బాడీ బిల్డర్స్ ఫిట్‌నెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శిలపరశెట్టి బాబి తెలిపారు. స్థానిక రైతు భారతి ఆడిటోరియంలో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా రూ.25 వేలు, రన్నర్‌గా రూ.10 వేల తోపాటు 55 నుంచి 85 కేజీల విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.4 వేలు, రూ.3 వేలు, రూ. 2వేలు, వెయ్యి రూపాయలతోపాటు షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరపల్లి కృష్ణాజీ మాట్లాడుతూ గతంలో విశాఖ జిల్లాలో క్రీడలు నిర్వహించేవారమని, కొత్త జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాపోటీల గోడపత్రికను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి మళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

నేడు జిల్లావ్యాప్తంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

అనకాపల్లి టౌన్: జాతీయస్థాయి ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్షను ఆదివారం నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో 4,150 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. రెండు తనిఖీ బృందాలను, 36 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, 200మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ల పరిధి 18 కేంద్రాల్లో పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు.

వ్యాన్ ఢీకొట్టి డ్రైవర్ మృతి



భాస్కర్‌రెడ్డి (ఫైల్)

నక్కపల్లి: మండలంలో జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో ఐషర్ వ్యాన్ ఢీకొనడంతో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ విభీషణ్‌రావు వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి డ్రైవర్ బండి భాస్కర్‌రెడ్డి(35) సోనాలిక ట్రాక్టర్‌ను తీసుకుని శ్రీకాకుళం వెళ్తుండగా.. శుక్రవారం అర్ధరాత్రి వెనుక నుంచి వచ్చిన ఐషర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ బోల్తాపడటంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం మాచవరం గ్రామంగా గుర్తించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జిల్లా స్థాయి స్విమ్మింగ్ జట్టు ఎంపిక

మునగపాక : తిమ్మరాజుపేట డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి స్విమ్మింగ్ జట్టు ఎంపిక జరుగుతుందని అనకాపల్లి జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సుందరయ్య, సీహెచ్ దేముడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్, ఐఎం ఈవెంట్లలో జరిగే పోటీల్లో గ్రూప్-1,2,3 కేటగిరీకి చెందిన స్విమ్మర్లు పాల్గొనవచ్చున్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన స్విమ్మర్లు ఈనెల 16న నర్సారావుపేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారన్నారు. ఆసక్తి కల స్విమ్మర్లు మరిన్ని వివరాలకు 9573690954 ఫోన్ నంబరును సంప్రదించాలని వారు కోరారు.

8న మునగపాక పీఏసీఎస్ శత వార్షికోత్సవం

- పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



శత వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: రైతుల భాగస్వామ్యంతో ఈ నెల 8న జరగనున్న మునగపాక పీఏసీఎస్ శత వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునగపాక పీఏసీఎస్ ఏర్పాటై వందేళ్లు పూర్తయిన సందర్భంగా పాలకవర్గం ఆధ్వర్యంలో వార్షికోత్సవానికి సన్నద్ధం కావడం అభినందనీయమన్నారు. పీఏసీఎస్‌ల అభివృద్ధికి ప్రభుత్వం తగు ప్రోత్సాహం ఇస్తుందన్నారు. జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు పాల్గొన్నారు.

తిరుమల విద్యాసంస్థల అధినేతకు పితృ వియోగం



నున్న చంద్రశేఖర్ రావు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలోని తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు తండ్రి నున్న చంద్రశేఖర్‌రావు (92) శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. చంద్రశేఖర్ రావుకు ముగ్గురు కుమారులు నున్న తిరుమలరావు, కృష్ణ, సురేష్, కుమార్తె హేమంతపద్మావతి ఉన్నారు. ఆయన వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినా వారి పిల్లలను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు. తన పెద్ద కుమారుడైన నున్న తిరుమలరావు తిరుమల విద్యా సంస్థలను స్థాపించి నేడు ఎంతోమందికి విద్యనందిస్తున్నారు. చంద్రశేఖర్‌రావు పార్థీవదేహానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పలువురు ప్రముఖులు, తిరుమల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, గ్రామస్తులు నివాళులు అర్పించారు.

బాలలను పనిలో పెట్టుకుంటే రూ.20 వేల జరిమానా

- చోడవరం సహాయ కార్మిక అధికారి సూర్యనారాయణ హెచ్చరిక

దేవరాపల్లి: బాలలను పనిలో పెట్టుకుంటే సదరు యజమానికి రూ.20 వేల జరిమానా విధిస్తామని చోడవరం సహాయ కార్మిక అధికారి పి. సూర్యనారాయణ హెచ్చరించారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా దేవరాపల్లిలో బాల కార్మికులను గుర్తించేందుకు ఐసీడీఎస్, కార్మిక, పోలీస్, నీడ్స్ ఆర్గనైజేషన్ తదితర శాఖల ఆధ్వర్యంలో శనివారం పలు దుకాణాలు, హోటళ్లు, బేకరీలు, ఇటుక బట్టీలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సహాయ కార్మిక అధికారి మాట్లాడుతూ ఇటుక బట్టీల నిర్వాహకులు పని ప్రదేశంలో కార్మికులకు మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయం తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. ప్రథమ చికిత్స కిట్టు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.నాగేంద్ర, ఐసీడీఎస్ సీడీపీవో వి. మంగతాయారు, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్త వేధింపులతో బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య



హేమ అరుంధతి (ఫైల్)



సంఘటన స్థలంలో శ్రీనివాసరావు మృతదేహం

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం కె.వెంకటాపురానికి చెందిన ఎస్‌బీఐ ఉద్యోగి సిహెచ్. హేమ అరుంధతి (36) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రూరల్ ఎస్సై ధనుంజయ నాయుడు వివరాల ప్రకారం.. నర్సీపట్నం ఎస్‌బీఐ(బజార్)లో పనిచేస్తున్న ఆమె భర్త వేధింపులతో మనస్తాపానికి గురైంది. శుక్రవారం సాయంత్రం పెదబొడ్డేపల్లి సెయింట్ ఆన్స్ స్కూల్ వెనుక జీడితోటల్లోకి స్కూటీపై వెళ్లింది. అక్కడ స్కూటీ పార్కు చేసి, తన శవాన్ని చూసిన వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలంటూ తెల్లకాగితంపై ఫోన్ నంబరు రాసింది. తన దగ్గర చున్నీతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె మొదటి భర్త చనిపోవడంతో రాజమహేంద్రవరానికి చెందిన సహాంత్‌ను రెండో వివాహం చేసుకుంది. వీరిద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అతడి వేధింపులు భరించలేక గతేడాది నవంబర్‌లో ఆత్మహత్యకు ప్రయత్నించింది. మృతురాలికి మూడేళ్ల బాబు, తల్లిదండ్రులు ఉన్నారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అప్పుల బాధ తాళలేక ప్రైవేటు ఉద్యోగి..

నర్సీపట్నం: గొలుగొండ మండలం రావణాపల్లి గ్రామానికి చెందిన ఆళ్ల శ్రీనివాసరావు(35) అప్పుల బాధ తాళలేక క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్సై ధనుంజనాయుడు వివరాల ప్రకారం .. మృతుడు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బైక్‌పై బయలుదేరి, నర్సీపట్నం మండలం నెల్లిమెట్ట వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. తాను మధ్యవర్తిగా పలువురికి అప్పులు ఇప్పించాని, దీనివల్ల ఒత్తిళ్లకు గురవుతున్నానని చనిపోయే ముందు రావణాపల్లి టీడీపీ వాట్సాప్ గ్రూపులో సూసైడ్ నోట్ రాసిపెట్టాడు. గ్రూపులో మెసేజ్ చూసిన గ్రామస్తులు అక్కడకు వెళ్లి చూసేసరికి అప్పటికే చనిపోయి ఉన్నాడు. అతడికి భార్య దేవి, ఆరేళ్ల కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

రేపటి నుంచి నృసింహ స్వామి మాలధారణ

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోట శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి 41 రోజుల మాలధారణ (చందన దీక్ష) ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న 32 రోజుల మాల, 23న 21రోజుల మాల, జనవరి 4న 11 రోజుల మాలధారణ ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతీ ఏడాది భోగిపండుగ రోజు రాత్రి మాలధారణతో ఉండి శ్రీ గోదాదేవి అమ్మవారి కల్యాణం నిర్వహిస్తారని, మరుసటి రోజు మాలవిరమణ కార్యక్రమాలు చేపడతామని వివరించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరికీ సహిత విద్య



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శకుంతల

అనకాపల్లిటౌన్ : జిల్లాలో గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరికీ సహిత విద్య చేరువ చేస్తున్నట్లు ఆ విభాగం సమన్వయకర్త శకుంతల అన్నారు. స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి వృత్యంతర శిక్షణలో ఆమె మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లలందరికీ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అప్పారావు, ఏపీవో వెంకటేశ్వరరావు, రాష్ట్రస్థాయి సహిత విద్యా విభాగం కన్సల్టెంట్ నర్సింహం, రాష్ట్ర అబ్జర్వర్ పి.అమ్మినాయుడు, హైస్కూల్ హెచ్ఎం రుధిరాణి, జిల్లాలో ఉన్న స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

సామూహిక సెలవుపై వినతిపత్రం



డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

అనకాపల్లిటౌన్ : జిల్లాలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు సామూహిక సెలవులు పెడుతున్నట్లు ఉద్యోగ సంఘాల నాయకుడు బొడ్డేటి అచ్యుతకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు సామూహిక సెలవుపై వినతిపత్రం అందజేశారు. ఈనెల 4న స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద ఆవేదన దీక్ష, 11న చలో విజయవాడ, 20 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు టి.కృష్ణ, సీహెచ్ రామచంద్ర, జి.నాగేశ్వరరావు, ఆర్.రమణ, పూడి వెంకటరావు, పట్నాల సతీష్, జి.నూకేశ్వరరావు, వాసుదేవ్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 3,446 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,060	4,300
మొదటి రకం	3,880	4,250
రెండో రకం	3,750	4,070
మూడో రకం	3,500	3,740

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
కాలింగ్ సహస్ర	: సత్యనారాయణస్క్రీన్-1
బ్రీత్(వైద్యో నారాయణో హరి)మార్నింగ్ షో	
విక్రమ్ రాథోడ్	: సత్యనారాయణస్క్రీన్-2
ఆనిమల్	: షిర్డిసాయి
కోటబొమ్మాళి	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్ పార్టీ	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 17 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-3 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 409 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 335 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924-223595)ని సంప్రదించవచ్చు.

నాడు అనకాపల్లి పట్టణం అభివృద్ధికి దూరంగా ఉండేది. రహదారులు దయనీయంగా ఉండేవి. రోడ్ల విస్తరణ జరగకపోవడంతో ట్రాఫిక్ సమస్యతో వాహన చోదకులు ఇబ్బంది పడేవారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలంటే చాలా సమయం పట్టేది. వాహన చోదకులతో పాటు పాదచారులు ఇబ్బంది పడేవారు.

నేడు రహదారులు విస్తరించారు. కొత్త రోడ్లు వేస్తున్నారు. దీంతో పట్టణంలో రోడ్ల సమస్య తీరుతోంది. ఒకచోటు నుంచి మరో చోటుకు త్వరగా చేరుకునే వీలు కలిగింది. రోడ్ల విస్తరణ, పట్టణ సుందరీకరణతో అనకాపల్లి రూపురేఖలు మారుతున్నాయి.

ప్రగతి బాట



ఇటీవల అభివృద్ధి చేసిన రాజుపాలెం రోడ్డు

నూతన రహదారులతో అందాల పల్లెగా అనకాపల్లి

రోడ్ల నిర్మాణం, విస్తరణకు రూ.14.89 కోట్లు మంజూరు

పట్టణ ముఖ ద్వారంగా బౌద్ధ స్తూపం ఏర్పాటు



పట్టణంలో అభివృద్ధి చేసిన రోడ్డు



శరవేగంగా జరుగుతున్న సుంకరమెట్ట రోడ్డు విస్తరణ, డివైడర్ల నిర్మాణం

రహదారుల అభివృద్ధి ఇలా..

- రూ.3.43 కోట్లతో జలగల మదుం జంక్షన్ రోడ్డు నిర్మాణం
- రూ.3.58 కోట్లతో ప్రధాన రహదారికి నూతన హంగులు
- రూ.3.06 కోట్లతో పెరుగు బజార్ రోడ్డు నిర్మాణం
- రూ.2.48 కోట్లతో రాజుపాలెం రోడ్డు నిర్మాణం
- రూ. 1.41 కోట్లతో నెహ్రూ చౌక్ నుంచి గుండాల జంక్షన్‌కు వెళ్లే రహదారి నిర్మాణం
- రూ.94.10 లక్షలతో రైల్వే స్టేషన్ రోడ్డు నిర్మాణం



ఇది కదా అభివృద్ధి

తుమ్మపాల : గత కొన్నేళ్లుగా అభివృద్ధిలో వెనుకబడి ఉన్న అనకాపల్లి ఇప్పుడు అభివృద్ధిపథాన సాగిపోతోంది. ప్రత్యేక జోన్‌గా ఉన్న పట్టణంతో పాటు కొన్ని గ్రామాల్లో అభివృద్ధి గత ప్రభుత్వంలో అంతంత మాత్రమే అని చెప్పక తప్పదు. ఈ దశలో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడంతో అనకాపల్లి పట్టణ రూపురేఖలు వేగంగా మారుతున్నాయి. అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుండడంతో సకల హంగులు సమకూరుతున్నాయి. ఎన్నికల సమయంలో గుడివాడ అమర్‌నాథ్ అనేక సార్లు అనకాపల్లిని అందాల పల్లెగా మారుస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు అనకాపల్లి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. జీవీఎంసీ జోన్-7గా ఉన్న అనకాపల్లి పట్టణంలో 80,81,82,83,84 వార్డులు ఉన్నాయి. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు సంక్షేమ పథకాలతో పాటు రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు ఖర్చు చేస్తోంది. గడచిన ఏడాది కాలంలో పట్టణ ప్రధాన రహదారుల అభివృద్ధికి దాదాపు రూ.14 కోట్లు వెచ్చించింది. రోడ్ల విస్తరణ పనులు శరవేగంగా సాగుతూ పట్టణ రూపురేఖలు మారుతున్నాయి.

రూ.3.43 కోట్లతో జలగల మదుం జంక్షన్ రోడ్డు విస్తరణ..

విశాఖ నుంచి పట్టణంలోకి ప్రవేశించే జలగల మదుం జంక్షన్, సుంకరమెట్ట, వై జంక్షన్ వరకు ఉన్న సింగిల్ రోడ్డును విస్తరించి మధ్యలో డివైడర్లతో రెండు రోడ్లు అభివృద్ధి చేస్తున్నారు. సెంట్రల్ లైటింగ్‌తో కలిపి ఈ రోడ్డు అభివృద్ధికి రూ.3.43 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

రూ.3.58 కోట్లతో ప్రధాన రహదారికి నూతన హంగులు..

పట్టణంలో ప్రధాన రహదారి అయిన సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారద బ్రిడ్జి వరకు రెండు కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డును సాధ్యమైనంత వరకు విస్తరించి నూతన డివైడర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఫుట్‌పాత్‌పై టైల్స్, సెంట్రల్ లైటింగ్ ఆధునికీకరణకు రూ. 1.68 కోట్లు, రోడ్డు పునర్నిర్మాణానికి రూ.1.90 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

రూ.3.06 కోట్లతో పెరుగుబజార్ రోడ్డు విస్తరణ..

పట్టణానికి ప్రధాన సమస్యగా ఉన్న పెరుగుబజార్ గాంధీ బొమ్మ జంక్షన్ రోడ్డు విస్తరణకు రూ.98 లక్షలు, ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటుకు రూ.2.08 కోట్లు వెచ్చించారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు ఏర్పాటుతో పట్టణంలో మార్కెట్‌కు రాకపోకలు సులభతరం కానున్నాయి. పట్టణం నుంచి రైల్వేస్టేషన్, రింగ్ రోడ్డు వంటి ప్రాంతాల్లో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహన చోదకులు రాకపోకలు సాగించవచ్చు.

రూ.2.48 కోట్లతో రాజుపాలెం రోడ్డు అభివృద్ధి..

జీవీఎంసీ వీలీన గ్రామాలుగా ఉన్న రాజుపాలెం, వల్లూరు, ఎరుకువానిపాలెం, గొర్లివానిపాలెం గ్రామాలకు వెళ్లాలంటే నరకంగా ఉండేది. రోడ్డు బీటలు వారి వాహన చోదకులు ఇబ్బందులు పడేవారు. దాదాపు నాలుగు కిలోమీటర్ల పొడవు గల అనకాపల్లి-విశాఖ రహదారి, కేఎస్ఆర్ పేట రోడ్లను రూ.2.48 కోట్లతో అభివృద్ధి చేశారు.

నెహ్రూ చౌక్ రహదారి విస్తరణకు 1.41 కోట్లు..

అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి చోడవరం వైపు గల గుండాల జంక్షన్ వరకు రోడ్డు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డును విస్తరించారు. ఫుట్‌పాత్ ఏర్పాటుతో పాటు టైల్స్, బీటీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు ఈ రోడ్డుపై సులువుగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

రూ.94.10 లక్షలతో రైల్వేస్టేషన్ రోడ్డు అభివృద్ధి..

జిల్లా ప్రధాన కేంద్రంగా ఉన్న అనకాపల్లి పట్టణంలో రైల్వే స్టేషన్ నిత్యం రద్దీగా ఉంటుంది. జిల్లాలో మరెక్కడా ప్రధాన రైల్వేస్టేషన్ లేకపోవడంతో జిల్లా ప్రజలతో పాటు అల్లూరి జిల్లా వాసులు కూడా అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు రావడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు అభివృద్ధికి రూ.94 లక్షలు ఖర్చు చేసి పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక రచించారు.

నిమిషాల్లో గ్రామానికి చేరుకుంటున్నాం..



గతంలో ఎరుకువానిపాలెం అధ్వానంగా ఉండేది. ఈ దారిలో ప్రయాణించాలంటే అందరూ భయపడిపోయేవారు. ప్రస్తుత ప్రభుత్వం రహదారి విస్తరించడంతో పాటు అభివృద్ధి చేసింది. కేఎస్ఆర్ పేట జాతీయ రహదారి నుంచి మా గ్రామానికి చేరుకోవాలంటే రహదారి బీటలు వారి ఎత్తుపల్లాలుగా ఉండేది. ఇప్పుడు రోడ్డు విస్తరించడం, అభివృద్ధి చేయడంతో నిమిషాల్లో మా గ్రామానికి చేరుకోగలుగుతున్నాం.

– కొత్తపల్లి సూర్య, ఎరుకునివానిపాలెం

రహదారులు అందంగా తీర్చిదిద్దారు..



అనకాపల్లి పట్టణ రహదారులు ప్రస్తుతం అద్భుతంగా తయారవుతున్నాయి. చిన్న పట్టణంగా ఉండే అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారడంతో పట్టణానికి అన్ని వైపులా రోడ్లను విస్తరించి ముఖద్వారాలను సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలో ప్రధాన రహదారులతో పాటు రైల్వేస్టేషన్ రహదారి విస్తరించడంతో సులువుగా రాకపోకలు సాగుతున్నాయి.

– బంటు ఇంద్ర, కోట్నివీధి

సాంకేతికాభివృద్ధితో విరివిగా ఉపాధి అవకాశాలు



సర్టిఫికెట్లు పొందిన మహిళలతో డీఈవో వెంకటలక్ష్మమ్మ తదితరులు

అనకాపల్లిటౌన్ : ఆధునిక సాంకేతికతతో ఆన్‌లైన్ వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) మురారి వెంకట లక్ష్మమ్మ అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో జనశిక్షణ సంస్థాన్ సహకారంతో టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ ఉచిత తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతికత ద్వారా ప్రయోజనాలు పొందడం ఎంత అవసరమో, మోసాలకు చిక్కకుండా జాగ్రత్త పడటమూ అంతే అవసరం అన్నారు. అందుకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమన్నారు. గ్రామీణుల్లో డిజిటల్ అక్షరాస్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో జరుగుతున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరతా అభియన్ కార్యక్రమం దీని కోసమే నిర్దేశించారన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ సీఏ రామరాజు మాట్లాడుతూ శిక్షణ కాలంలో స్టేషనరీ, మెటీరియల్ ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణ మూడు మాసాలు ఉంటుందని తెలిపారు. గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ 2025 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలు మనుషుల చేతుల్లోంచి జారిపోయి యాంత్రీకరణ దిశగా వెళ్తాయన్నారు. కొత్తగా 9.7 కోట్ల ఉద్యోగాలు వస్తాయని ప్రపంచ ఆర్థిక నివేదిక అంచనా వేసిందని తెలిపారు. అనంతరం గతంలో శిక్షణ పొందిన మహిళలకు వెంకటలక్ష్మమ్మ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ కె.నాయుడు, గ్రంథాలయ సభ్యులు మళ్ల బాపునాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ, కె.జగ్గారావు, బొడ్డేడ జగ్గ అప్పారావు, టైలరింగ్ శిక్షకురాలు రాపేటి ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి



వెంకుపాలెంలో సమావేశమైన రజకులు

అనకాపల్లి రూరల్ : పరిష్కారం కాని రజకుల సమస్యలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్తానని ఉమ్మడి విశాఖ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము రజకులకు హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని వెంకుపాలెంలో జరిగిన రజక సంఘం సమావేశానికి హాజరయ్యారు. సీతానగరం, వెంకుపాలెం గ్రామాలకు చెందిన రజకుల సమస్యలను తెలుసుకున్నారు. సమావేశంలో పలువురు రజకులు గ్రామాల్లో తమ హక్కులకు భంగం కలుగుతున్న విషయాన్ని కుల సంఘం నేతలకు వివరించారు. అనకాపల్లి రజక సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దూరి శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి గురుమూర్తి, ఉపాధ్యక్షుడు పట్నాల ప్రసాద్, కోడూరు గోపాలకృష్ణ, సూరిబాబు, నాగేశ్వరరావు, అప్పలకొండ, రాజు రమేష్, శ్రీను, ఈశ్వరరావు, సత్యం, చెన్నయ్య, కోటేశ్వరరావు, అప్పారావు, సత్తిబాబు, అనిత, వరలక్ష్మి, లక్ష్మి, ముసలమ్మ, చిన్న ముసలమ్మ, అప్పల నర్సయ్యమ్మ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- జేసీ జాహ్నవి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న జేసీ జాహ్నవి

అనకాపల్లిటౌన్: ఓటే వజ్రాయుధమని, దానిని వినియోగించుకునేందుకు అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి సూచించారు. పట్టణంలో జీవీఎంసీ పెదహైస్కూల్, కశింకోట మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. పట్టణంతో పాటు మండలం, కశింకోట మండలంలో శని, ఆదివారాలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పోలింగ్‌బూత్‌లవారీగా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఓటరు నమోదుపై విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఆర్డీవో సందర్శన

పట్టణంతో పాటు, మండలంలో, కశింకోటలో పలు పోలింగ్ కేంద్రాల వారీగా జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆర్డీవో ఏజె.చిన్నికృష్ణ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం కూడా పోలింగ్ బూత్‌ల వద్ద బూత్‌లెవెల్ అధికారులు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దశల వారీగా గ్రామాలను అభివృద్ధి చేస్తామని, ఎక్కడైనా సమస్యలుంటే సంబంధిత అధికారులకు తెలపాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 10వ సాధారణ మహాజన సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైన అభివృద్ధి పనులు జరగకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావును ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అయితా రాము, ఈవోఆర్డీ ధర్మారావు, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో కలెక్టర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి దంపతులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శనివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

ధ్యానంతో దుర్వ్యసనాలు దూరం

కశింకోట : దుర్వ్యసనాల నుంచి దూరం కావడానికి ధ్యానం దోహదపడుతుందని కరుణామయ పిరమిడ్ ధ్యాన కేంద్రం వ్యవస్థాపకురాలు రాపేటి బాల అన్నారు. కశింకోటలోని కనక మహాలక్ష్మి వీధి రామాలయంలో శనివారం ధ్యానంపై స్థానికులకు ఉచిత శిక్షణ నిర్వహించారు.

తల్లిదండ్రుల పేరిట జన్మభూమికి సేవ అభినందనీయం

- రూ.10 లక్షలతో ఏఎస్ పేటలో రుద్రభూమి అభివృద్ధి



శ్మశానవాటికను ప్రారంభిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణారావు

కశింకోట: తల్లిదండ్రుల పేరిట జన్మభూమికి సేవలందించడం అభినందనీయమని విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు అన్నారు. అమీన్‌సాహెబ్‌పేట (ఏఎస్ పేట) గ్రామానికి చెందిన జెర్రిపోతుల సోమునాయుడు, నాగులమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు రమణాజీ రూ.10లక్షల సొంత నిధులతో గ్రామంలోని శ్మశాన వాటికను అభివృద్ధి చేశారు. దానిని తిమ్మరాజుపేట డావెన్స్ ఇంటర్నేషనల్ స్కూలు ఎండీ కర్రి సుందరయ్యతో కలిసి రమణారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణాజీ సేవలను కొనియాడారు. రమణాజీ మాట్లాడుతూ ఉన్న ఊరికి, జన్మభూమికి, కన్న తల్లిదండ్రులకు ఎంత సేవ చేసినా రుణం తీరదన్నారు. తనకు చేతనైన మేరకు గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు.

మహిళా వికాసమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి (పై ఫొటో), హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులు

అనకాపల్లిటౌన్ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేసి వారికే ప్రతి పథకం వర్తించేలా చేశారని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఫంక్షన్ హాలులో శనివారం ఆమె స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సభ్యుల సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై సమీక్షించారు. స్వయం సహాయ సంఘాల సభ్యులు లీడ్‌బ్యాంకు, ఇతర సర్వీస్ బ్యాంకర్లతో సమన్వయంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సుజాత, జీవీఎంసీ ఏపీడీ దొరబాబు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, డీఆర్‌డీఏ జిల్లా కార్యక్రమ మేనేజర్ కుమారస్వామి, డీఆర్‌డీఏ కోఆర్డినేటర్ ధర్మారావు, బ్యాంకుల మేనేజర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పరిశోధన గ్రంథాల ఆవిష్కరణ



కళాశాలలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రత్నాకర్

అనకాపల్లిటౌన్ : స్థానిక డైట్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్, అల్గారిథమ్స్ అప్లికేషన్స్‌పై రీసెర్చి వర్క్స్ పుస్తకాలను చైర్మన్ దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన తమ కళాశాల అధ్యాపకుల రీసెర్చిపై అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ కె.సుజాత, పలు విభాగాధిపతులు ఎ.వెంకటేశ్వరరావు, డీన్ కె.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బాలగౌరమ్మ మండపంలో అన్నసమారాధన

గవరపాలెం సంతోషిమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బాలగౌరమ్మ మండపంలో డైట్ కళాశాల చైర్మన్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నసమారాధనను ప్రారంభించారు. అంతకు ముందు ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు రత్నాకర్‌ను ఘనంగా సత్కరించారు. స్థానిక జీవీఎంసీ పెద హైస్కూల్, గాంధీ నగరం హైస్కూళ్లలో నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని సందర్శించారు. అనంతరం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థుల్లో రక్తహీనత నివారణే లక్ష్యం

- అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ



లేమర్తి హైస్కూల్లో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు రాగి జావ, చెక్కీలు, జగనన్న గోరుముద్ద వంటి పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. ప్రతీ ఒక్కరూ వీటిని తీసుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్టడీ అవర్‌లో ఉన్న పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదువుకుని, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తరువాత రక్తహీనత గల పిల్లల వివరాలు సేకరించారు. వారు విధిగా ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్స్ వేసుకునేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని అమ్మాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల్లో 'మిచాంగ్' కలవరం



కశింకోట ప్రాంతంలో వరి కోతలు

కశింకోట: మిచాంగ్ తుపాను హెచ్చరికలతో మండలంలోని వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల కోతలు ప్రారంభం కాగా.. మరికొన్ని చోట్ల కోతలు ప్రారంభించడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తుపాను ప్రభావం వల్ల భారీ వర్షాలు, పెను గాలులు వీచనున్నట్లు వాతావరణ హెచ్చరికలు వెలువడుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం కంటే తక్కువగా సుమారు 840 హెక్టార్లలో వరి పంట వేశారు. మొదట్లో అడపాదడపా వర్షాలు కురిసినా పొలం నాటిన తర్వాత వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో బోర్లు, శారదానది నీటి సహాయంతో ఆరుగాలం కష్టపడి సకాలంలో పంట పండించారు. ముందుగా నాట్లు వేసిన తీడ, అడ్డాం, చెరకాం, కశింకోట తదితర గ్రామాల్లో ఇప్పటికే కోతలు ప్రారంభించారు. మిగిలిన గ్రామాల్లో పొలాలు కోతకు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో మిచాంగ్ తుపాను పొంచి ఉండటం, ఆకాశం మేఘావృతమై ఇప్పటికే గాలులు వేస్తుండటంతో పండిన పంటకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.